ప్రజాశక్తి

ఆదివారం 23 నవంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

వార్తలు 5లో..

అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

పెట్టుబడిదారుల ప్రయోజనాలకే లేబర్ కోడ్స్

పలుచోట్ల కార్మిక సంఘాల ఆధ్వర్యాన ప్రతుల దహనం

మ్యాచ్‌కు సిద్ధమైన స్టేడియం

భారత్ - దక్షిణాఫ్రికా వన్డేకు పటిష్ట ఏర్పాట్లు

28 నుంచి ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని ఎసిఎ - విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో డిసెంబర్ 6న జరుగనున్న భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎసిఎ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఆట మైదానంలోనూ, వెలుపలా ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించేందుకు ఎసిఎ కట్టుబడి ఉందని, దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఈ పండగలో పాల్గొనాలని కోరారు. ఎసిఎ కార్యదర్శి సతీష్ బాబు మాట్లాడుతూ ఆపరేషన్స్ బృందం పిచ్, స్టేడియం సిద్ధత, భద్రత, అతిథ్యం, టికెటింగ్‌తో సహా అన్ని విభాగాల్లో నిపుణతతో పనిచేస్తోందని తెలిపారు.

టికెట్ల ధరలు ఇలా..

ఈ మ్యాచ్‌కు సంబంధించి టికెట్ల విక్రయాలను ఈ నెల 28 నుంచి ప్రారంభించనున్నారు. సుమారు 22 వేల టిక్కెట్లు అమ్మకానికి అందుబాటులో ఉండనున్నాయని, కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే విక్రయాలు జరుగుతాయని అధికారులు తెలిపారు. సాధారణ టికెట్ ధరలు రూ.1,200 నుంచి రూ.4,000, హాస్పిటాలిటీ/సెమీ హాస్పిటాలిటీ టికెట్ ధరలు రూ.5,000 నుంచి రూ.18,000గా నిర్ణయించారు.

గిరి ఉత్పత్తుల

కొనుగోలు లక్ష్యాలను చేరుకోవాలి

జిసిసి వైస్ ఛైర్‌పర్సన్, ఎమ్‌డి కల్పనా కుమారి

మాట్లాడుతున్న కల్పనాకుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గిరిజన ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యాల సాధనకు అందరూ కృషి చేయాలని జిసిసి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి అన్నారు. గిరిజన సహకార సంస్థ కార్యకలాపాలపై శనివారం ఉదయం బీచ్ రోడ్డులోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కాఫీ, అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకాలపై సమీక్ష నిర్వహించిన ఆమె మిగిలిన లక్ష్యాన్ని తప్పకుండా సాధించాలని అధికారులను ఆదేశించారు. 2025-26 సంవత్సరానికిగాను మొత్తం వార్షిక లక్ష్యం రూ. 62,016.02 లక్షలు కాగా నవంబర్ నెల వరకు జిసిసి రూ.24,048.59 లక్షల పురోగతిని సాధించిందని తెలిపారు. గత సంవత్సరంలో ఇదే కాలానికి సాధించిన రూ.23,478.86 లక్షలతో పోలిస్తే 102 శాతం అధికం కావడం విశేషమన్నారు. మిగిలిన రూ.37,967.43 లక్షల లక్ష్యాన్ని సాధించేందుకు డివిజనల్ సొసైటీ మేనేజర్లు ప్రత్యేక కృషి చేయాలని ఆమె సూచించారు. గత సంవత్సరంతో పోలిస్తే కొన్ని కీలక విభాగాలలో గణనీయమైన ప్రగతి నమోదైందని, అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు విభాగంలో ఏకంగా 159 శాతం ప్రగతితో రూ.378.43 లక్షల కొనుగోళ్ల జరిగాయని తెలిపారు. కాఫీ రైతులకు రుణ సాయం విభాగంలో అత్యధికంగా 636 శాతం వృద్ధి నమోదైందన్నారు. ఈ సంవత్సరం రూ.99.85 లక్షల రుణాలు అందించినట్టు తెలిపారు. రుణ వసూళ్లలో 160 శాతం వృద్ధి సాధించి రూ.27.15 లక్షల వసూళ్లు నమోదయ్యాయని వెల్లడించారు. ఎల్‌పిజి గ్యాస్ విక్రయాల విభాగంలో 111 శాతం వృద్ధితో రూ.1761.41 లక్షల విక్రయాలు జరిగాయన్నారు. రోజువారీ అవసరాల అమ్మకాలలో 105 శాతం పురోగతి సాధించామని, పెట్రోల్ బంకులు, సూపర్ బజార్ మిగతా 2లో..

శబరిమలై యాత్రకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్ : శబరిమలై యాత్రకు ఆర్టిసి ప్రత్యేక బస్సులను విశాఖ నుంచి నడుపుతోందని ఆర్టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. శనివారం విశాఖపట్నం డిపో నుండి శబరిమలై యాత్రకు మొదటి ప్రత్యేక బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా శబరిమలై యాత్రకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఇప్పటికే దీక్ష చేస్తున్న స్వాములు ఆరు బస్సులు బుక్ చేసుకున్నారని, మిగిలినవారు సంప్రదింపులు చేస్తున్నారని తెలిపారు. ఎపిఎస్‌ఆర్టీసీ శబరిమల యాత్రకు భక్తుల కోరిక మేరకు బస్సు రూట్లను బట్టి, బస్సు ధరను నిర్ణయిస్తుందన్నారు. అదేవిధంగా ప్రయాణికుల రద్దీని బట్టి ప్రతి వారం కూడా హైదరాబాద్, విజయవాడ మొదలగు ప్రాంతాలకు స్పెషల్ బస్సులు నడుపుతున్నామని తెలిపారు. కార్తీక మాసంలో పంచరామ మిగతా 2లో..

వార్త 8లో..

హోరాహోరీ పోరులో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

- హోం మంత్రి అనిత
- నక్కపల్లిలో హాకీ టోర్నీ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి..

గిరి ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యాలను చేరుకోవాలి

విక్రయాలు లక్ష్యానికి దగ్గరగా 97 నుంచి 99 శాతం వరకూ ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని జిసిసి డివిజనల్ మేనేజర్లు, సొసైటీ మేనేజర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడే జిసిసి కార్యకలాపాలను మరింత మెరుగుపరచాలని కల్పనా కుమారి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కాఫీ కొనుగోలు లక్ష్యాలు, ధరలు

ఇదిలా ఉండగా గిరిజన కాఫీ రైతులకు అండగా ఉండేందుకు 2025-26 సంవత్సరానికిగాను 1175 టన్నుల కాఫీ కొనుగోలును లక్ష్యంగా నిర్ణయించారు. రైతులకు మద్దతు ధరలను కూడా ఖరారు చేశారు, అరెబికా పార్చ్‌మెంట్ కాఫీ రకం కిలో రూ.450, అరెబికా చెర్రీ కిలో రూ.270, రోబస్టా చెర్రీ కాఫీ రూ. 170గా నిర్ణయించారు

శబరిమలై యాత్రకు ప్రత్యేక బస్సులు

క్షేత్ర దర్శన యాత్రలకు మంచి స్పందన లభించిందని, ధనుర్మాసంలో కూడా పంచ వైష్ణవ క్షేత్ర దర్శనానికి కూడా బస్సులు నడుపుతున్నామన్నారు. దూరప్రాంత ఎసి బస్సుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని, తమ సంస్థలో పనిచేసే డ్రైవర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తున్నామని,ఆకస్మిక ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్స్ ఏ విధంగా ప్రయాణికులకు రక్షణ కల్పించాలో నేర్పుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గంగాధర్, వర్క్ మేనేజర్ అరుణ కుమారి, విశాఖపట్నం డిపో మేనేజర్ మణి మాధురి, అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ, హిమబిందు, సూపర్‌వైజర్లు, సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఋణ పత్రాల మంజూరు

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఇ రుణ ప్రోత్సాహక కార్యక్రమం వైజాగ్ పట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీలో ఘనంగా జరిగింది. బ్యాంకు ఉన్నతాధికారులతో పాటు ముఖ్య అతిథులుగా జాయింట్ డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం, పద్మ, అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, జనరల్ మేనేజర్ ఆదిశేషు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీలు, వాటి అర్హత ప్రమాణాలు, వాటి ప్రయోజనాలను అధికారులు సరళమైన భాషలో వివరించారు. అదేవిధంగా వ్యాపార సమాజానికి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న ప్రధాన రుణపథకాలైన సెంట్రల్ బిజినెస్ సెంట్ జిఎస్‌టి, సెంట్ టెక్స్ టైల్స్, సెంట్ షాపి, సెంట్ రైస్ మిల్, సెంట్ హోటల్ వంటి ప్రముఖ స్కీములపై అవగాహన కల్పించారు. ఈ రుణ పథకాల ద్వారా వ్యాపారులు పొందగల గరిష్ట లాభాలు, వాటి వినియోగ విధానాలపై సూచనలు, మార్గదర్శకాలు అందించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, పార్వతీపురం జిల్లాల పరిధిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల నుండి పాల్గొన్న కస్టమర్లకు మొత్తం రూ.56 కోట్లు విలువైన ఎంఎస్ఎంఇ రుణ మంజూరు పత్రాలను కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్న, సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలకు అభివృద్ధి దిశగా మరింత ముందడుగు పడేలా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన పాత్ర పోషించనుందని అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ ప్రక్షాళనకు శ్రీకారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రక్షాళనకు ఏఐసిసి నిర్ణయం తీసుకుందని ఏఐసిసి పరిశీలక కమిటీ సభ్యులు మార్టిన్ లూథర్, అమర్ జహ బేగం తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హాసిని వర్మ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్కా రామారావు, ఎపిసిసి స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కమలాకర్, తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి, దక్షిణ నియోజకవర్గ ఇంచార్జ్ కెవి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలందించడంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : ఆరోగ్య సేవలందించడంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకమని రఘు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ పండా పేర్కొన్నారు. 64వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని రఘు ఫార్మశీ కళాశాల విద్యార్థులు నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయం సమీపంలో ఉన్న రఘు క్యాంప్స్ నుంచి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రజలకు అవగహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ పండా మాట్లాడుతూ, ప్రతి ఏటా నవంబర్ మూడో వారంలో ఫార్మశీ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రాథమిక చికిత్స, దీర్ఘకాల వ్యాధుల నిర్వహణ, ఆరోగ్య పరీక్షలు, వ్యాక్సినేషన్, హెల్త్ కాంప్‌ల ద్వారా ఫార్మసిస్ట్‌ల విజ్ఞానం, నైపుణ్యం ప్రజలకు అర్థం అవుతుందన్నారు. ర్యాలీలో డాక్టర్ పద్మజా, డాక్టర్ రమాదేవి పండా శిరిషా, ఎన్‌సిసి కోఆర్డినేటర్ రమణమ్మ, ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలు, స్టీల్‌ప్లాంట్ / ప్రైవేటీకరణ చర్యలపై పోరాటం

మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మెడికల్ కాలేజీలు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయనున్నామని పలువురు వక్తలు తెలిపారు. వైసిపి ఎస్‌సి సెల్ విభాగం అధ్యక్షులు బోని శివరామకృష్ణ, లీగల్ సెల్ అధ్యక్షులు పాకా సత్యనారాయణ అధ్యక్షతన శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేస్తూ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం చారిత్రక తప్పిదమని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్రానికి సిఎం చంద్రబాబు అన్ని విధాల తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్య ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు సక్రమంగా పనిచేయడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం భావ్యం కాదన్నారు. ఉద్యోగులు పనిచేయకుండానే స్టీల్ ప్లాంట్ ఇన్నాళ్లు ఎలా నడిచిందని ప్రశ్నించారు. సభాధ్యక్షులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అన్ని తరగతుల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వైసిపి దక్షిణ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల పట్ల చంద్రబాబు ఒక ఫూల్ వలే వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి, వైసిపి నియోజకవర్గాల సమన్వయకర్తలు తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ కుమార్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, చెన్నా జానకిరామ్, నాయకులు అల్లంపల్లి రాజాబాబు, ఆల్ఫా కృష్ణ పాల్గొన్నారు.

మభ్యపెట్టడమే విధానమా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ తమ ద్వంద్వ వైఖరికి పూర్తిగా పదును పెడుతోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ పక్కన పెట్టి పలు సమస్యలపై ఎదురుదాడి లేదా తిరగదోడే విధానాన్ని అమలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూడడం స్పష్టంగా వెల్లడవుతోంది. విశాఖలోని పెదగంట్యాడలో జనావాసాల మధ్య అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వద్దని స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాడి ప్రజాభిప్రాయ సేకరణను సైతం రెండు నెలల క్రితం తిప్పికొట్టారు. ఇప్పటికే అదాని గంగవరం పోర్టు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలంతా ఏకమై సిమెంట్ ఫ్యాక్టరీపైనా తిరగబడిన సంగతి తెలిసిందే. కానీ రద్దుకు ప్రభుత్వం సుముఖంగా లేదు. జివిఎంసి సర్వసభ్య సమావేశంలో శుక్రవారం 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు దీనిపై జీరో అవర్‌లోనే చర్చను లేవనెత్తారు. తమ ఎంఎల్‌ఎ, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన ప్రజల స్పందన బట్టి మేం చర్యలు తీసుకుంటామని ఆ వెంటనే ప్రకటన చేశారని బుకాయించేందుకు అధికార పార్టీ కార్పొరేటర్లు చూశారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ కోసం వందల ఎకరాలను అప్పగించే తెలుగుదేశం పార్టీ విధానాన్ని స్థానిక ప్రజలు వ్యతిరేకిస్తున్నా వారిని భయపెట్టి ల్యాండ్‌ను తీసుకునే యత్నాలకు టిడిపి స్థానిక ఎంఎల్‌ఎ సహా అధికారులను రంగంలోకి దించడం తాజా పరిణామం.

విశాఖ ఉక్కుపై అభాండాలు

ఆంధ్రుల హక్కు - విశాఖ ఉక్కు విషయంలోనూ సిఎం చంద్రబాబు సహా కూటమి నేతల వ్యవహారం ద్వంద్వ వైఖరినే పట్టిచూపుతోంది. రూ.14 వేల కోట్లు ప్యాకేజీ ఇచ్చాక ఇంకా ప్రైవేటీకరణ ఎక్కడ ? ఉంటుందంటూ బయటకు చెబుతూనే లోలోన కేంద్రంలోని మోడీ సర్కారు ప్రైవేటీకరణ విధానానికి కూటమి నేతలు సహకరిస్తున్నారు.

సెట్విస్ సిఇఓగా రమ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ సెట్విస్ సిఇఓగా మెట్ట రమ్య నియమితులయ్యారు. 2016 గ్రూప్ -1 బ్యాచ్‌కు చెందిన ఈమె ఇప్పటి వరకూ విశాఖపట్టణంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. తాజా ఉత్తర్వుల ప్రకారం స్థానిక జెడ్పీ జంక్షన్ సమీపంలో ఉన్న సెట్విస్ కార్యాలయంలో శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి సిఇఓగా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి కె.కవిత అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

IN THE HONOURABLE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT : NARSIPATNAM
O.S. 299/2024

BETWEEN
Ruthala Srinivasarao ...**Plaintiff**
And
A.M. Sowkat Ali Khan ...**Defendant**

To
A.M. Sowkat Ali Khan,
S/o. A. Mohammed Rafi, Muslim, Prop: Chintamani Traders, Abid Centre, R/o. Dr.No. 3-59, Komati Veedhi, Narsipatnam (t) and Mandal Anakapalle District.

In the above O.S. 299/2024 Summonses were not served on you. Hence as per the orders of the Honourable Court, you are being the DEFENDANT, you are requested to appear before the Honourable Court in order to defend your case. The above matter is stands posted to **8-12-2025 BY 10-30 a.m.,** for your appearance this publication is issued by way of substitute service. On your failure, you will be set exparte.

SRI R.D.V.G.V. PRASAD
ADVOCATE FOR PETITIONER/PLAINTIFF
Narsipatnam
DATE: 21-11-2025

IN THE HONOURABLE COURT OF THE II ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VISAKHAPATNAM
E.P.106/2021 In Dis. 307/2016

Between:
Chalapathi Chit Fund (P) Ltd., Visakhapatnam Branch, ...Decree Holder
And:
P.Sree Devi & Others . . . Judgment Debtors

JDR-7: P.Naresh, Slo. Appala Reddy, C/o.P.Gunavathi, Hindu, aged 30 Years, D.NO52-6-9, Resapuvanipalem, Visakhapatnam-13.
JDR-9: P.Sree Devi, W/o. Appala Reddy, C/o.P.Gunavathi, Hindu, aged 41 Years, D.No. 52-6-9, Resapuvanipalem, Visakhapatnam-13.

NOTICE

Please take notice that the Decree Holder filed the above E P under Order 21 Rule 46 of CPC for attachment of death benefits of deceased P.Appala Reddy (JDR-2) sum of Rs. 5,10,201/- (Rupees Five Lakhs Ten Thousand Two Hundred and One Only) and notice sent to you being legal heirs of deceased P.Appala Reddy, not served personally to you. So, the Honourable Court ordered notice through publication and the same stands posted to **01-12-2025 at 10.30 A.M** for your appearance on that day you are personally or through Advocate attend before the Honourable Court of the II addl. Civil Judge (Junior Division) at Visakhapatnam, failing with the natter will be heard and determined in your absence as per law.

(By Order Of the Court)
CH.AMARNATH
Advocate for the DHR,
Gajuwaka/Visakhapatnam

మహారాజశ్రీ VII సినియర్ సివిల్ జడ్జి కోర్టు విశాఖపట్నం
O.S. No. 124/2025

నోట్ల వెంకటేశ్వర సూకరాజు ...**వాది**
మరియు
మాదేటి రామారావు & ఇతరులు
టు: ...**ప్రతివాదులు**

D1) మాదేటి రామారావు S/o వెంకటరమణ, డోర్.నెం.10-20-12/ఏ, పితానిదిబ్బ, మహారాణిపేట, విశాఖపట్నం.
D2) మాదేటి చెన్న కేశ్వరి W/o రామారావు, డోర్.నెం.10-20-12/ఏ, పితానిదిబ్బ, మహారాణిపేట, విశాఖపట్నం.

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైవ వివరించిన వాజ్యము వాది తెప్పించి నందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **2025వ సం.12 నెల 9వ తారిఖున (9-12-2025) పగలు 10.30** గంటలకు స్వతహగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలుగారి ద్వారాగా లేక సరి అయిన ఏజంట్ మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యందు వల్ల మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజు లన్నింటిని నీ యొక్క స్టేట్ మెంటుతో సహ ఆరోజు హాజరుపర్చుటకు మీకు ఉత్తరువు చేయడమైనది. పైన చెప్పబడిన దిన మందు మీరు హాజరు కాకుండ తప్పిన యెడల మీ పరోక్షమందు పై వాజ్యమును విమర్శన చేసి తీర్మానించటము గురించి మీకు తెలుసుకోవల్సింది.

By Court Order
R.LAKSHMANA RAO
B. JYOTHI, ADVOCATES
VISAKHAPATNAM

BEFORE THE CHAIRMAN M.A.C.T. CUM PRINCIPAL DIST JUDGE AT SURYAPET
O.P. No. 112 of 2025

BETWEEN:-
లకావత్ సుధాకర్ .....పిటీషనరు
మరియు
పొట్లాడ నాగరాజు మరియు ఇతరులు .....రెస్పాండెంట్స్

టు,R-1
పొట్లాడ నాగరాజు S/o: నర్సింహ వయస్సు 59 సం॥లు, వృత్తి: లారీడ్రైవర్ R/o: D.No. 12-90, BC కాలనీ, Po) అగ్నంపూడి VTC, జిల్లా విశాఖపట్నం.
టు,R-2
పల్లెల గోవిందరావు S/o: క్రిష్ణారావు R/o: H.No. 27-7-57 శ్రీనగర్, గాజువాక, విశాఖపట్నం.

పైన తెలిపిన పిటీషనరు పై గౌరవనీయ కోర్టులో సెక్షను 166 యం.వి. యాక్టు 1988 మరియు రూల్స్ 455 ఆంధ్రప్రదేశ్ యం.వి. యాక్టు రూల్స్ 1989 ప్రకారం ప్రమాద నష్టపరిహారం గురించి కేసు వేయడమైనది. పై కేసులో మీలోని 1వ, 2వ వారికి కోర్టుద్వారా, పోస్టుద్వారా పంపిన నోటీసు ముట్టక తిరిగివచ్చినది. పై కేసు మీ హాజరు నిమిత్తం **ది.06-01-2026 న కలదు.** కావున మీరు ఆరోజున పై కోర్టుయందు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని ఉదయం 10:30 గం॥లకు హాజరు కాగలరు. లేనిచో పై కేసు మీ పరోక్షంలో తీర్పు చెప్పబడును.

//కోర్టు వారి అనుమతితో//

గోండ్రాల అశోక్
అడ్వకేట్
సూర్యాపేట
సెల్: 9490569341

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

సెన్సస్ కమిషనర్ శర్మ

ప్రజాశక్తి -భీమునిపట్నం : క్షేత్ర స్థాయిలో జనాభా గణన సర్వే చేస్తున్న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు సమన్వయంతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయని ఆఫీస్ ఆఫ్ ది రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రిజిస్ట్రార్ (న్యూ ఢిల్లీ) వివిఎల్ఎన్.శర్మ స్పష్టం చేశారు. జివిఎంసి 2, 3 వార్డుల్లో ప్రయోగాత్మకంగా జనాభా గణన సర్వే జరుగుతున్న విషయం విదితమే. ఇందుకు సంబంధించి నియమితులైన 69 మంది ఎన్యూమరేటర్లు, 9 మంది సూపర్వైజర్లతో జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, అనుభవాలు, సమస్యలుంటే వాటిని ఎలా అధిగమించవచ్చు తదితర అంశాల ఆధారంగా సమావేశం జరిగింది. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు లేవనెత్తిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సర్వేలో పొందుపరిచిన 34 అంశాలను ప్రజల నుంచి సమగ్రంగా సేకరించాలని సూచించారు. స్వీయ గణన, డిజిటల్ లే అవుట్ మ్యాపింగ్, ఇండ్ల జాబితా, ఇండ్ల గణన అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలని నొక్కి చెప్పారు. జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ సెన్సస్ ఆపరేషన్స్ ఎస్.దయాసాగర్, జిల్లా ఇంచార్జి పిల్లా రేవతి, జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలన

జనాభా గణన సర్వే ప్రక్రియ అమలు ఎలా జరుగుతుందో తెలుసుకునే క్రమంలో సమావేశానికి ముందు సంబంధిత అధికారులతో కలిసి జివిఎంసి 2, 3 వార్డుల్లో శర్మ క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. మూడో వార్డు పరిధి పిఎన్ఎం.స్కూల్ సమీపంలో పర్యటించి సర్వే తీరును పరిశీలించారు.

జనాభా గణన సర్వేను పరిశీలిస్తున్న శర్మ తదితరులు

నేరాలు ఘోరాలు

రైల్వే ట్రాక్‌పై యువకుని మృతదేహం

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ పోలీసు పరిధిలో శనివారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో దుర్గా నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై సుమారు 33 సంవత్సరాల వయసున్న యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం తల, మొండెం వేరుగా ఉండటాన్ని గమనించి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ప్రాథమికంగా భావిస్తున్నారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా మృతుడు పెదగంట్యాడ పరిధి సీతానగరానికి చెందిన నంబారపు అప్పారావు (తండ్రి అప్పలనాయుడు)గా గుర్తించారు.

ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌టాప్ పోలీసులకు అందజేత

ప్రజాశక్తి- ఆనందపురం : ఆటోలో ప్రయాణికుడు మరిచి పోయిన ల్యాప్‌టాప్‌ను డ్రైవర్ డి.గోవింద్ పోలీసులకు అప్పగించాడు. భోగాపురం గ్రామానికి చెందిన యువ ఆటో డ్రైవర్ గోవింద్ శనివారం ఉదయం ఆనందపురం నుండి మధురవాడకు ప్రయాణికులను తీసుకెళుతున్న సమయంలో వేములవలస కామత్ హోటల్ సమీపంలో ఆటోలో ప్రయాణించిన వ్యక్తి దిగిపోయాడు. తనతో ఉన్న హెచ్‌పి ల్యాప్‌టాప్‌ను ఆటోలోనే మరిచిపోయాడు. కొద్ది సేపటి తర్వాత ఆటోలో ల్యాప్‌టాప్ కనిపించడంతో, దాని యజమానిని వెతకడానికి ప్రయత్నించాడు. అతని కనిపించకపోవడంతో ల్యాప్‌టాప్‌ను ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వాసునాయుడుకు అందజేశారు. గోవింద్‌ను సిఐ, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమునిపట్నం మండలం తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023, 2024 విద్యా సంవత్సరాల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు శనివారం తాటితూరు సర్పంచి సిరిగుడి సంతోషి ఈశ్వరరావు తన సొంత నిధులతో నగదు బహుమతి అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దోకర శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్పంచి సిరుగుడి సంతోషి ఈశ్వరరావు మాట్లాడుతూ, 2023లో ఈగల దివ్య, జి. అప్పలరెడ్డి, తిప్పల గీత, 2024లో రిత్విక్‌రెడ్డి, ఎస్.వినాయక, ఎస్.మనీషా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1 వెయ్యి చొప్పున అందించినట్లు చెప్పారు. 2026లో జరిగే పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కూడా నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సోమేశ్వరరావు, పి.మురళి, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టైప్ పరీక్షలు రెండు రోజులు నిర్వహించాలి

ప్రజాశక్తి- తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ద్వారా ఆరు నెలలకు నాలుగు బ్యాచ్‌ల చొప్పున రెండు రోజులు టైప్ రైటింగ్ పరీక్షలు జరిగేవని, జనవరి 2026 నుండి టైప్ పరీక్షలు ఒక్క రోజులో నాలుగు బ్యాచ్‌లు జరుపుటకు తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురవుతారని విశాఖపట్నం జిల్లా టైప్ షార్ట్ హ్యాండ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరావు, సెక్రటరీ రమేష్ పేర్కొన్నారు. పాత పద్ధతిలో రెండు రోజులు నాలుగు బ్యాచ్ చొప్పున పరీక్షలు జరపాలని సాంకేతిక విద్యాశాఖ అధికారులను కోరారు.

25లోగా వికలాంగుల మూడు చక్రాల వాహనాలకు దరఖాస్తు

ప్రజాశక్తి- పద్మనాభం : వికలాంగులు మూడు చక్రాల వాహనాల కోసం ఈ నెల 25వ తేదీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పద్మనాభం ఎంపిడిఒ కె.రూపేష్ తెలిపారు. 18 నుండి 45 సంవత్సరాలు మధ్య ఉన్న వికలాంగులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సంవత్సరానికి రూ.3 లక్షల ఆదాయానికి లోబడి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. గతంలో ప్రభుత్వం నుంచి లేదా ఏదైనా ప్రైవేటు సంస్థ నుంచి కానీ ఇటువంటి వాహనాలను పొంది ఉండరాదని పేర్కొన్నారు.

సిపిఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మధురవాడ : సిపిఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చెయ్యాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. జివిఎంసి 5వ వార్డు పరిధి నగరంపాలెంలో జరిగిన సిపిఐ సభ్యుల సమావేశంలో పైడిరాజు మాట్లాడుతూ, దున్నేవాడికి భూమి, బ్యాంకులు జాతీయకరణ, కార్మికులకు 8 గంటలు పని తదితర చట్టాలు సిపిఐ పోరాట ఫలితమేనని తెలిపారు. సమావేశంలో వి.సత్యనారాయణ, పి.వి.అప్పారావు, ఎం.ఎస్.పాత్రుడు, ఎ.వి.రమణ, వి.నరసింహులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం, పాండ్రంగి పంచాయతీల పరిధిలో ఉన్న జగనన్న కాలనీలో శనివారం ఉదయం 5 నుండి 6:30 గంటల వరకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సిఐ సి.హెచ్.శ్రీధర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సంఘ విద్రోహ శక్తుల నుంచి ప్రజల భద్రత కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిఐ తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌లో రిజిస్ట్రేషన్ లేకుండా, రిజిస్ట్రేషన్ చెల్లుబాటు కాని ఒక ఆటో, ఎనిమిది బైకులను గుర్తించి సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు.

అయ్యప్ప స్వాముల నిత్యాన్నదానం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి సంజయ్‌గాంధీ కాలనీ పోలమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి శబరి పీఠం ఆధ్వర్యంలో ప్రతిరోజు మధ్యాహ్నం అయ్యప్ప, భవాని భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం నాయకులు అక్కరమాని వెంకట్రావు పాల్గొని అయ్యప్ప భక్తులకు వడ్డించారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి శబరి పీఠం స్వాములు మాట్లాడుతూ, గత నెల 18 నుంచి ప్రారంభించిన నిత్యాన్నదానం ఈ నెల 27వ తేదీతో ముగుస్తుందని తెలిపారు.

చుక్క సూరిబాబుకు నివాళి

ప్రజాశక్తి -తగరపువలస : భీమునిపట్నం మండలం అమనాంలో టిడిపి నాయకులు చుక్క సూరిబాబు చిత్రపటానికి గ్రామ అధ్యక్షులు కంబవు శివకుమార్ శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నెల 9వ తేదీన గుండె పోటుతో సూరిబాబు మృతి చెందడంతో శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. శివకుమార్ మాట్లాడుతూ, సూరిబాబు మృతితో గ్రామానికి పెద్దదిక్కును కోల్పోయామన్నారు. సొంతగా పాటలు రాసి ఆలపించడంతోపాటు ప్రత్యేక భజన బృందాన్ని నడిపించారని తెలిపారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

ఫ్రెషర్స్ డే వేడుకల ప్రారంభంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : విద్యార్థులు ఉన్నతి లక్ష్యాలు పెట్టుకుని, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సంస్థ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణ నిబద్ధతతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రొఫెసర్ డాక్టర్ జి.గిరిజాశంకర్, డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, రోగ సంరక్షణ ప్రజారోగ్యంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని, జ్ఞానం పరిశోధనా దృక్పథం ఉండి విద్యా ప్రయాణం ఆరంభించాలని చెప్పారు. ఎస్ఐ జి.మల్లేశ్వరి, బ్రహ్మకుమారి సిస్టర్ తనూజ మాట్లాడుతూ, విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు, ప్రవర్తన, సామాజిక బాధ్యత దృష్టి చెదరని విధంగా ఉండాలన్నారు. శాస్త్రవేత్త ఎన్.నరేష్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు పరిశోధనలో పాల్గొని వైద్య సాంకేతికత రంగంలో రాణించాలని చెప్పారు విద్యార్థులకు షీల్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.నాగపూర్ణశ్రీ, డాక్టర్ ఎమ్.ప్రియాంక, ప్రిన్సిపల్ ఎ.చంద్రశేఖర్, ఎస్.విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

'కేథరిన్'లో 500 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని మూలకుద్దు గల్లీ రోడ్డు కేథరిన్ స్కూల్ వేదికగా శనివారం ఉచిత నేత్ర, సాధారణ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కేథరిన్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రొఫెసర్ ఆర్‌డి.రత్నరాజ్, విద్యా సంస్థల డైరెక్టర్ ఆలివర్ రాయి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వివిధ గ్రామాల ప్రజలు దాదాపు 500 మందికి నేత్ర, సాధారణ వైద్య పరీక్షలు చేశారు. కంటి చూపు మందగించిన వారికి త్వరలో ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, వైద్యులు తగిన సూచనలు, సలహాలు అందజేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సౌమ్య, లక్ష్మీవిజయ, మెడికేర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు డి.వి.రామభద్రరాజు, డాక్టర్ రమ్య, సురేఖ క్లినిక్ వైద్యులు రాజేష్, సూర్య చంద్రిక పాల్గొని వైద్య సేవలందించారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వి.శ్రీనివాసరెడ్డి సహకారం అందించారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎగువపేటలో విద్యార్థులకు దంత పరీక్షలు

జివిఎంసి మూడో వార్డు పరిధి ఎగువపేట సామాజిక భవనం వద్ద శనివారం అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆధ్వర్యాన ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 40 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేశారు. దంత సంరక్షణకు సంబంధించి విద్యార్థులకు వైద్యులు పలు సూచనలు, సలహాలు అందజేశారు. దంత వైద్యులు నీరజ, పి.సుకన్య, టి.చాందిని, యు.పూర్ణిమ, పిఆర్‌ఒ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతి తనిఖీ ఏజెన్సీలో శిక్షణ

ప్రజాశక్తి -ఆనందపురం: ఎగుమతి తనిఖీ ఏజెన్సీ చెన్నై సబ్ ఆఫీస్ ఆనందపురం మండలం గంభీరంలో ఎగుమతి తనిఖీ ఏజెన్సీ కార్యాలయంలో ఐదు రోజులపాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మైక్రోబయాలజీ, కెమికల్ టెస్టింగ్, కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్లు, జిఎంపి, ఎస్ఎస్ఒపి నిబంధనలు, హెచ్ఎసిసిపి విధానాలు, దిగుమతి దేశాల అవసరాలు, ఫిర్యాదుల నిర్వహణ పద్ధతులపై ఈ శిక్షణ ఏర్పాటు చేశారు. సిఐఎఫ్‌టి ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి.మధుసూదనరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి సుధాన్శుశేఖర్ దాస్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో అధికారులతో పాటు పలు సాంకేతిక నిపుణులు శిక్షణ అందించారు. విశాఖపట్నం, కాకినాడ ప్రాంతాలకు చెందిన మత్స్య ఎగుమతిదారులు ఈ శిక్షణను పొందేందుకు ఆమోదం పొందగా, కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారికి శిక్షణ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- హెచ్చరిక బోర్డులు తొలగించి మరీ అక్రమ నిర్మాణాలు
- దారపాలెంలో చేజారిపోతున్న రూ.కోట్ల విలువ చేసే సర్కారు భూములు
- కబ్జాదారులపై చర్యలు శూన్యం

ప్రజాశక్తి - ఆరిలోవ : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమో, రాజకీయ నాయకుల సహకారమో గానీ రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోతోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్టు వ్యవహరించడం పట్ల ప్రజల్లో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇదంతా 13వ వార్డు పరిధి బీఆర్‌టిఎస్ రహదారి దారపాలెంలో చోటుచేసుకుంది. 15/12లో కొండ పోరంబోకు ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలం ఎంతో కాలంగా కబ్జాకు గురవుతూ వస్తోంది. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి రావడంతో గతంలో ఇక్కడ సర్వే నిర్వహించి 19 చోట్ల రెవెన్యూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. వీటిని తొలగించి ఎలాగైనా హస్తగతం చేసుకునేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇటీవల నగరంలో పెట్టుబడుల సదస్సులు జరగడంతో అధికారులంతా ఆ పనిలో ఉండడాన్ని అదనుగా భావించి కబ్జాదారులు సందటిలో సడేమియారా అనే విధంగా హెచ్చరిక బోర్డులు తొలగించి దర్జాగా సుమారు 400 వందల గజాల స్థలంలో అక్రమంగా రెండు రేకుల షెడ్లు నిర్మించేశారు. వీటికి విద్యుత్ మీటర్లు అమర్చి అమ్మకానికి పెట్టినట్టు సమాచారం. ఇంత బహిరంగంగా హెచ్చరిక బోర్డులను తొలగించి అక్రమ నిర్మాణాలు చేపట్టినా రెవెన్యూ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత విఆర్‌ఒను వివరణ కోరగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఇది జరిగి రోజులు గడుస్తున్నా రెవెన్యూ ఉన్నతాధికారులు కబ్జారాయుళ్లపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన కబ్జారాయుళ్లపై కఠిన చర్యలు తీసుకొని, రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

దారపాలెం ప్రభుత్వ భూమిలో పెట్టిన హెచ్చరిక బోర్డులను తొలగించి కబ్జా చేసి రేకుల షెడ్ల నిర్మాణంపై స్థానిక తహశీల్దార్‌ను వివరణ కోరేందుకు వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌ను వివరణ కోరగా దీనిపై ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

కబ్జా చేసిన స్థలంలో నిర్మించిన రేకుల షెడ్లు

గతంలో రెవెన్యూ సిబ్బంది పెట్టిన హెచ్చరిక బోర్డులు

మధ్య తరగతి మందహాసం
పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ రచయిత కీర్తిశేషులు బెహరా వెంకట సుబ్బారావు రచించిన సర్వ సభ్య రచనల సంపుటి మధ్య తరగతి మందహాసం పుస్తక పరిచయ సభ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. సాహితీ వేత్తల సమక్షంలో జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా రైటర్స్ అకాడమి ఛైర్మన్, లీడర్ పత్రికాధిపతి వి.వి.రమణమూర్తి హాజరై బెహరా సత్యనారాయణ మూర్తిని, ఈ పుస్తకాన్ని సమీక్షించిన ముగ్గురు ఉపన్యాసకులును అభినందించారు. మానవతా విలువలు గల కథలు ఉండటం గొప్ప విషయమన్నారు. 30 సంవత్సరాల తరువాత దీనిని పుస్తకరూపంలోకి వెంకటసుబ్బారావు తీసుకొచ్చి బతికించారని కొనియాడారు. మధ్య తరగతి జీవితం ఎలా ఉంటుందో ప్రతి కథలో దాగి ఉందని, ఆ విషయాన్ని సమీక్షకులు చక్కగా చెప్పారన్నారు. మధ్య తరగతి ప్రజలు నిజాయతీగా ఉంటారని చెప్పారు. పెళ్లికి సంబంధించిన కథను వినిపించి, అందులో నీతిని సభ ముందుంచారు. వెంకట సుబ్బారావు కుమారుడు బెహరా సత్యనారాయణమూర్తిని సత్కరించారు. బెహరా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఈ పుస్తకం విజయనగరంలో ఆవిష్కరణ జరిగిందని, నాన్నకి విశాఖపట్నంతో సంబంధం ఉండటంతో పరిచయం ఇక్కడ చేస్తున్నామని చెప్పారు. నాన్న కథల్లో ఉత్తరాంధ్ర యాస ఉంటుందని, సామాజిక సమస్యల్ని ఎత్తిచూపారని వివరించారు. అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ, 500 పేజీలు పుస్తకంలో 73 కథలు, 2 నవలలు ఉన్నాయని చెప్పారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ, ఈ పుస్తకంలో మానవీయ విలువలు చాటే కథలున్నాయని, రైల్వేస్టేషన్‌లో జరిగిన కథను, మానవత్వం చాటే కథను వివరించారు. జయంతి ప్రకాష్ శర్మ మాట్లాడుతూ, కథలన్నీ కుటుంబ నేపథ్యంలో ఉన్నాయని వివరించారు. సర్వసిద్ధి హనుమంతరావు పైలాపచీస్ కథను సమీక్షించారు. బసు పోతన సభకు ఆహ్వానం పలికిన సభ కె.సన్యాసిరాజు వందన సమర్పణతో ముగిసింది.

ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నర్సింగరాజు

ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీపై ర్యాలీ

ప్రజాశక్తి- పెందుర్తి : సుజాతనగర్‌లోని ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యాన ట్రాఫిక్ ఎడ్యుకేషన్, రోడ్డు సేఫ్టీపై చేపట్టిన ర్యాలీని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్, పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగరాజు ప్రారంభించారు. ఈ స్పెషల్ క్యాంపులో 6వ రోజు చేపట్టిన ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ థియోఫిలస్ మాట్లాడుతూ, సీట్ బెల్ట్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ, ఎడ్యుకేషన్, ఎంపవర్‌మెంట్, ఇంజినీరింగ్ ప్రాధాన్యత గురించి వివరించారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్, రోడ్డు దాటే విధానం గురించి చెబుతూ, అవి పాటించకపోతే జరిగే నష్టాలను వివరించారు. అనంతరం ఎస్ఐ నర్సింగరాజును కరస్పాండెంట్ సత్కరించారు.

యుజిడి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి ఇందిరానగర్‌లో యుజిడి పనులకు శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజేష్‌తో కలిసి భూమి పూజ చేశారు. జివిఎంసి నిధులు రూ.34.60 లక్షలతో యుజిడి పనులను చేపట్టనున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు మద్దిల రాజేష్, యుజిడి అధికారులు నరేష్, స్థానిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ రామలక్ష్మి

బ్రెయిన్ స్ట్రోక్ నుంచి 9 నిమిషాల్లో స్వాంతన

కిమ్స్ ఐకాన్ వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : మెదడులో రక్తనాళం మూసుకుపోయినప్పుడు వచ్చే బ్రెయిన్ స్ట్రోక్ నుంచి కేవలం 9 నిమిషాల్లో ఒక రోగికి సాంత్వన కల్పించినట్లు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి న్యూరో, వాస్కులర్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ పోతుల వెంకటేష్ వివరించారు. నగరానికి చెందిన 60 ఏళ్ల వ్యక్తి పక్షవాతంతో ఆస్పత్రికి వచ్చారు. వెంటనే ఆయన మెదడుకు స్కానింగ్ చేయగా రక్తం గడ్డకట్టడంతో ఒక ప్రధాన రక్తనాళం మూసుకుపోయినట్లు తేలింది అని తెలిపారు. వెంటనే స్ట్రోక్ టీమ్ చికిత్స ప్రారంభించి గడ్డకట్టిన రక్తనాళాన్ని తొలగించేందుకు మెకానికల్ థ్రాంబెక్టమీ చికిత్స చేశామని వివరించారు. కేవలం 9 నిమిషాల్లోనే ఆయనకు రక్తప్రసారం మళ్లీ సాధారణ స్థితికి చేరుకుందని, చికిత్స తర్వాత కొన్ని గంటల్లో రోగి పూర్తిస్థాయిలో కోలుకున్నారని తెలిపారు.

మెకానికల్ థ్రాంబెక్టమీ అనేది సమయంతో పోరాడి చేసే ప్రక్రియ అని తెలిపారు. ఒక్కో నిమిషం ఆలస్యం అయ్యేకొద్దీ ఈ స్ట్రోక్ వల్ల మెదడులో 20 లక్షల కణాలు చచ్చిపోతాయని వివరించారు. పక్షవాతం లక్షణాలు కనిపించిన వెంటనే ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. థ్రాంబెలైసెస్ లేదా మెకానికల్ థ్రాంబెక్టమీతో ప్రాణాలు కాపాడి, వైకల్యాన్ని తగ్గించవచ్చని వివరించారు.

'కూటమి'లో పేదలకు వైద్యం అందని ద్రాక్ష

వైసిపి ఉమ్మడి విశాఖ జిల్లా పరిశీలకులు కురసాల కన్నబాబు

ప్రజాశక్తి-యంత్రాంగం

యస్.రాయవరం : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వల్ల పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మిగులుతుందని వైసిపి ఉమ్మడి విశాఖ జిల్లా పరిశీలకులు కురసాల కన్నబాబు అన్నారు. మండలంలోని గోకులపాడు గ్రామంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా శుక్రవారం రాత్రి చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసిపి పాలనలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలను కలుపుకొని 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, నాయకులు బొడ్డేటి ప్రసాదు, కంబాల జోగులు, మధు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యాన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో ఎంపిపి కలగ లక్ష్మి గున్నయ్య నాయుడు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీను, వైసిపి నాయకులు గొల్లివిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రి జయ రజని, నీటిపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

44వ వార్డు అబిద్‌నగర్‌లో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

సీతమ్మధార : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 44వ వార్డు పరిధి అబిద్‌నగర్ పార్కులో కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు సూచనల మేరకు రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి బాణాల తరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి ప్రెసిడెంట్ హబీబ్ ఖాన్, రామకృష్ణ, బాధ శ్రీనివాస్, పిడుగు వెంకటే, కోలా వెంకట్, బషీర్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడివాడ గురునాథరావు వర్ధంతి

ప్రజాశక్తి- గాజువాక : మింది గ్రామంలో గుడివాడ గురునాథరావు 24వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. గురునాధరావు విగ్రహానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ గుడివాడ అప్పలరామూర్తి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిత్రపూడి వెంకటరామయ్య, డిసిసిబి మాజీ ఛైర్మన్ పల్లా చిన్నతల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు ప్లాస్కులు పంపిణీ చేశారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆనందపురం : టిడిపి యువ నాయకులు గంటా రవితేజ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం అతని స్వగృహం వద్ద క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. గంటా రవితేజ సూచనలతో కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల యువతీయువకులు క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మరుపిళ్ల సాయిజ్ఞానేశ్వర్, కాకర సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పెట్టుబడిదారుల ప్రయోజనాలకే లేబర్ కోడ్స్

పలుచోట్ల ప్రతుల దహనం

అచ్యుతాపురంలో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

పరవాడలో నిరసన తెలుపుతున్న కార్మికులు

చోడవరంలో...

ప్రజాశక్తి-అనకాపల్లి : పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే కేంద్ర బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్ కింద తీసుకువచ్చిందని, ఈ లేబర్ కోడ్స్ కార్మికుల పాలిట ఉరితాడు వంటివని కార్మిక సంఘాలు మండిపడ్డాయి. సిఐటియు, ఏఐటియూసీ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి జీవో కాపీల్ని దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ .శంకర్రావు, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి ఆర్. దొరబాబు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ఐదు సంవత్సరాలుగా మార్పులు చేయడానికి ప్రయత్నించిందని మండిపడ్డారు. కార్మికులు పోరాటంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం ఇప్పుడు నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చిందని పేర్కొన్నారు. ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ పేరుతో కార్మికుల శ్రమను దోచుకోవడం, కార్మిక సంఘాల్ని లేకుండా చేయడం సమ్మె చేసే హక్కులను కాలరాయడమే అన్నారు. కార్మికులపై విపరీతమైన శిక్షలు వేయడం, కంపెనీల యజమానులకు అనుకూలంగా ఈ చట్టాలను మార్చేశారని స్పష్టం చేశారు. దేశంలో పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, కార్మికుల సంక్షేమం కోసం ఏమాత్రం ఆలోచన చేయకపోవడం సరి కాదన్నారు. ఈ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, పిఎన్వి పరమేశ్వరరావు, మండల కన్వీనర్ తేలయ్య బాబు, బి.అప్పారావు, రాము, నూకరాజు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పి సత్యనారాయణ, ఆర్.అప్పలరాజు కె శంకర్రావు, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ అచ్యుతాపురం జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కన్వీనర్ కె సోము నాయుడు, పురిటి చిన్న, కాకి రాజు, పి చొడప్పరావు, పి ప్రసాద్, ఏ రమణ, శ్యాము, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలం కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఎస్ఇజెడ్, ఎన్ఏఓబి, అసంఘటితరంగా కార్మికులు లేబర్ కోడ్స్ జీవోను రద్దు చేయాలని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి దేవుడు నాయుడు, మండల కన్వీనర్, చందక రామకృష్ణ, ఎన్ఏఓబి యూనియన్ నాయకులు బద్ది భాస్కరరావు, ఆటో యూనియన్ నాయకులు భూపతి అప్పారావు, ముఠా యూనియన్ నాయకులు చిన్న, కొబ్బరి ఒలుపు కార్మికులు బి ముసలయ్య సత్య శ్రీను, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మండలంలోని సూర్రెడ్డిపాలెం గ్రామంలో సిఐటియు కార్యకర్తలు సంబంధిత జీవో కాపీలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఈర్లి నాయుడు బాబు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు,

మధురవాడలో..

మండల కార్యదర్శి వనము సూర్యనారాయణ, రొంగల గోపి, సిరిపరపు రాము, టి కృష్ణమ్మ, ఎల్ పాపయ్య పాల్గొన్నారు.

చోడవరం : నాలుగు లేబర్ కోడ్స్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చోడవరంలో కార్మికులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, ఎస్ వి నాయుడు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నర్సీపట్నం : కార్మిక హక్కులను హరించే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయి అసోసియేషన్ ఆధ్వర్యాన పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజాబాబు మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కేందుకే బిజెపి ప్రభుత్వం పని చేస్తుందని దుయ్యబట్టారు, లేబర్ కోర్డు రద్దు చేసే వరకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈరెల్లి చిరంజీవి, మున్సిపల్ కార్మిక నాయకులు కోటి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ జోనల్ కార్యాలయం సమీపంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్మిక వర్గానికి, సామాన్య ప్రజానీకానికి తీవ్ర హాని చేసే లేబర్ కోడ్‌లను ప్రజలందరూ వ్యతిరేకించాలని సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.రామప్పడు, సిహెచ్ శేషుబాబు, బి.నర్సింగరావు, టి.జాన్, బాలకృష్ణ, రమణ, లక్ష్మి, కె.అచ్చయ్యమ్మ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

26న నిరసన : సిఐటియు

విశాఖ కలెక్టరేట్ : కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ ఈ నెల 26న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపడతామని పేర్కొన్నారు. కార్మిక సంఘాలన్నీ పాల్గొంటాయని వెల్లడించారు. కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఏఐటియుసి ఆధ్వర్యాన..

నాలుగు లేబర్ కోడ్స్ అమలును నిలుపుదల చేయాలని ఏఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యాన జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

రాంబిల్లిలో..

కె.కోటపాడులో..

నర్సీపట్నంలో..

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభ సందర్భంగా అనకాపల్లిలో విద్యార్థిని విద్యార్థులచే ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 12,13, 14 వ తేదీల్లో తిరుపతిలోని ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు అనేక సమస్యలపై పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పేదలకు సిఎం సహాయ నిధి వరం

ప్రజాశక్తి -అనకాపల్లి:సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు తీసుకువెళ్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి నియోజకవర్గ, అనకాపల్లి పట్టణం వివిధ వార్డుల్లో 8 మంది లబ్ధిదారులకు గాను 3,41,619/- రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కులను ఆయా వార్డుల కూటమి నాయకుల చేతుల మీదగా లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిల్లల దత్తతపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి: జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి ప్రాజెక్ట్ కింతాడ మండలం పిసినికాడ సచివాలయంలో దత్తత అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సలహాదారులు ఎం.డి. భాను మాట్లాడుతూ, ఎవరైనా పిల్లలు దత్తత కావాలనుకుంటే స్పెషలైజెడ్ ఎడాప్షన్ ఏజెన్సీని సంప్రదించాలని తెలియజేశారు. చట్టానికి విరుద్ధంగా ఎవరు పిల్లలను దత్తత తీసుకోరాదని, అలా తీసుకున్న ఎడల వారికి చట్టపరమైన శిక్షలు తప్పవని ఆమె హెచ్చరించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం విధివిధానాలను ఆమె తెలియజేశారు. 0 నుంచి 18 సంవత్సరాలలోపు బాల బాలికలకు ఎటువంటి సమస్యలు ఉన్నా కూడా వారు 1098 హెల్ప్ లైన్ నెంబరికి తెలియపరచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసినికాడ గ్రామ సర్పంచ్ వై వి రమేష్, మహిళా పోలీస్ పి.గీత, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా 'హెరిటేజ్ వీక్'

ప్రజాశక్తి -అనకాపల్లి:వరల్డ్ హెరిటేజ్ వీక్‌లో భాగంగా శనివారం ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌కి విశేషస్పందన లభించింది. వందే మాతరం థీమ్ తో ఏర్పాటు చేయబడిన ఫోటో ఎగ్జిబిషన్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది. హెరిటేజ్ వీక్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర పురావస్తు శాఖకు చెందిన సిబ్బంది పీలా మహాలక్ష్మి, నాగరాజు బొజ్జన్న కొండ, అనకాపల్లిలో అన్ని పాఠశాల పిల్లలకి డ్రాయింగ్ కాంపిటీషన్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈనెల 25న జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ప్రదానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

సబ్ జైల్లో సమస్యలపై న్యాయమూర్తి ఆరా

ప్రజాశక్తి- అనకాపల్లి:అనకాపల్లి సబ్ జైల్లో సమస్యలను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ధర్మారావు శనివారం పరిశీలించారు. మండల్ లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో జైలును పరిశీలించారు. నిందితుల సమస్యలు, పరిస్థితులపై ఆరా తీశారు. ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించు కోవచ్చని సూచించారు. జైలు నుంచి బయటకు వెళ్ళాక సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. ఆహార మెనూ, గదులను పరిశీలించి పరిష్కారానికి సలహాలు ఇచ్చారు. జైల్ సూపరింటెండెంట్ కిరణ్, ఎం ఎల్ ఎస్ సి ప్రతినిధులు సత్యనారాయణ, సంధ్య, న్యాయ సహాయకులు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డులో పైపులైన్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి- అనకాపల్లి:జీవీఎంసీ 80వ వార్డులో ఎన్టీఆర్ కాలనీ మధుమ కింద మంచినీటి పైపులైను మరమ్మతుకు గురికావడంతో మంచినీరు వృధాగా పోతుందని వార్డు అధ్యక్షులు, సత్యనారాయణ స్వామి సూర్యనారాయణ స్వామివార్ దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి, 80వ వార్డు 12వ క్లస్టర్ ఇన్చార్జ్ బొడ్డేడ జోగి నాయుడు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం అయ్యేలా చేసిన జోగినాయుడును మురళి, వార్డు మహిళలు అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కొమ్మనాపల్లి సన్యాసిరావు దొడ్డి జగదీష్ మహిళలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి:గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు కల్పించాలని కోరుతూ శనివారం అనకాపల్లి శాసనసభ్యులు మంత్రి కొణతాల రామకృష్ణని సచివాలయాలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అసోసియేషన్ కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలో తమ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ గురించి ప్రస్తావించి ప్రస్తావించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'మన పల్లె-మన ఎమ్మెల్యే'

ప్రజాశక్తి- సబ్బవరం : ప్రజాసమస్యల పరిష్కరానికే 'మన పల్లె-మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని బోదువలస గ్రామంలో నిర్వహించిన 'మనపల్లె- మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులు చుట్టూ తిరిగే కన్నా నేరుగా గ్రామానికే అన్ని శాఖల అధికారులతో వచ్చి సమస్యలను త్వరితగతిని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలుచేస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బోదువలస, ఎల్లుప్పి గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ప్రజల అర్జీలను పరిశీలించారు. అనంతరం ఆయాశాఖల అధికారులుతో చర్చించి అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు. మిగిలినవాటిని మూడునెలల్లోనే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. మూడేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి పనులను సైతం పూర్తి చెయ్యడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిన్నికృష్ణ, ఎంపిడిఒ పి.పద్మజ, వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, హౌసింగ్ ఎఇ, కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, శరగడం రాము, మామిడి శంకరరావు, ఉగ్గిన రాము, ఆకుల గణేష్, రొమాల చంద్రశేఖర్, రేసుపూడి రమణ, గొర్లి కుమారస్వామి, బంతికోళ్ల పద్మ, ఎల్లాజీనాయుడు, అమరపిన్ని నర్సింగరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలంలోని ఈ మర్రిపాలెం గ్రామం రెవెన్యూ సర్వే నంబర్లు 28/1, 28/2, 28/3కు చెందిన ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు రెవెన్యూ శాఖ చర్యలు ప్రారంభించింది. ఈ భూమిని గొన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యం అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుందంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదును పరవాడ తహశీల్దార్ కార్యాలయం పరిశీలించింది. తహశీల్దార్ నాగరాజు ఆదేశాల మేరకు శనివారం విఆర్ఓ సత్యనారాయణ, విఆర్ఎల బృందం శనివారం ప్రభుత్వ భూమి సరిహద్దులను పరిశీలించారు. అనంతరం ఇది 'ప్రభుత్వ భూమి, ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు' అనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను ఆక్రమించే ఏ ప్రయత్నమైనా తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

భారత న్యాయ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజలకు ఎస్ఐ వి.సత్యనారాయణ శనివారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ, భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ న్యాయ సాక్ష్యం (బిఎస్ఎ), భారతీయ న్యాయ ప్రవర్తన సంహిత (బిఎన్ఎస్ఎస్) గురించి వివరించారు. ఈ మూడు చట్టాలు ఐపిసి/ సిఆర్‌పిసి/ఐఇఎ స్థానంలో వచ్చాయని తెలిపారు. చట్టాలు మారినందున పౌరులు వాటిపై కనీస అవగాహన కలిగి ఉండటం అత్యంత ముఖ్యం అని చెప్పారు. కొత్త చట్టాల అమలు పద్ధతి, మారిన నేర నిర్వచనాలు, శిక్షా విధానాలు, పోలీసింగ్‌లో వచ్చే మార్పులపై ప్రజలకు స్పష్టమైన అవగాహన అవసరమని తెలిపారు. ప్రజల హక్కులు, బాధ్యతలు, పోలీసు వ్యవస్థతో సమన్వయం వంటి అంశాలపై కూడా మార్గనిర్దేశం చేశారు. నూతన చట్టాలు పారదర్శకత, బాధ్యతాయుతమైన పోలీసింగ్, వేగవంతమైన న్యాయ ప్రక్రియ అమల్లో కీలకమవుతాయని పేర్కొన్నారు.

నీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి -యస్ రాయవరం : దార్లపూడి మేజర్ పంచాయతీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. దార్లపూడి సచివాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం మాట్లాడుతూ, మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలైనా తాగు నీరు కూడా అడుక్కునే దుస్థితి దార్లపూడిలో ఏర్పడడానికి సర్పంచ్ నిర్లక్ష్యమే కారణమన్నారు. పిట్టలవారి వీధిలో గతంలో ప్రభుత్వ వేసిన పైపులైను మూలంగా ఒక బిందె నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. పండగలు వస్తే మాత్రం ఒక్కొక్క ఇంటికి రూ.500 వసూలు చేస్తున్నారని, నీటిని మాత్రం అందించలేని స్థితిలో పంచాయతీ ఉందని ఎద్దేవాచేశారు. తక్షణమే అధికారులు స్పందించి మంచినీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు రవణమ్మ, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఒ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులకు అభినందనలు తెలుపుతున్న సభ్యులు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం తహశీల్దార్ కార్యాలయంలో గత విఆర్‌ఓ సంఘం అధ్యక్షులు రామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆర్.పెద్దన్నదొర, కార్యదర్శిగా ఇ.అప్పారావు, ఉపాధ్యక్షులుగా ఎం.నవీన్, సహాయ కార్యదర్శిగా పి.వెంకటసుధ, కోశాధికారిగా బి.రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు పెద్దన్నదొర మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కార్యవర్గ గౌరవాధ్యక్షులుగా పి.రామచంద్ర మూర్తిని ఎన్నుకున్నట్లు కార్యవర్గ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు నూకరత్నం, సూర్యనారాయణ, మురళీకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంఘ కార్యకలాపాలను విద్యార్థులకు వివరిస్తున్న సిఇఒ

పిఎసిఎస్‌ను సందర్శించిన ఎయు విద్యార్థులు

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని నాగులాపల్లి సహకార సంఘాన్ని (పిఎసిఎస్) ఆంధ్ర యూనివర్సిటీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డి.ఆశాలత ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం సందర్శించారు. సంఘం పనితీరు, సభ్యులు అందజేస్తున్న ఆర్థిక సంక్షేమ సేవలను పరిశీలించారు. సంఘం చైర్మన్ ఎల్లపు వెంకట భాస్కరరావు, సిఇఒ మల్ల స్వామిచంద్ర నాయుడు సంఘం చట్టం, బైలాలు, అకౌంటింగ్ సిస్టం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆశాలత మాట్లాడుతూ, సభ్యుల షేరుధనంపై వాణిజ్య బ్యాంకుకు మించి రూ.15 శాతం వడ్డీని బోనస్ రూపంలో అందజేయడం, చనిపోయిన సభ్యులకు రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా, రూ.10వేలు దహన ఖర్చులు వంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డి.పవన్‌కుమార్, ఎ.ఫణికుమార్, డాక్టర్ తపస్వి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం : కొణతాల

ప్రజాశక్తి - కశింకోట : సంక్షోభంలోను సంక్షేమాన్ని ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని నరసింగబిల్లి సహకార సంఘ పాలక వర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిఎసిఎస్‌లు ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో 100శాతం సీట్లు కూటమి గెలుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉమ్మడి విశాఖపట్నం డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము మాట్లాడారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ బ్యాంకు చైర్మన్‌గా మజ్జి నిరంజన్ కుమార్, డైరెక్టర్లుగా గిరిబాబు, నాని బాబు ప్రమాణ స్వీకారం చేశారు.

మట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

యలమంచిలి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్, యలమంచిలి : యలమంచిలిలో యలమంచిలి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రామకుమారి హాజరయ్యారు. చైర్మన్‌గా తట్టా లోవకుమారి, వైస్ చైర్మన్‌గా గొర్లి బాబూరావు, డైరెక్టర్లుగా రాయి సత్యనారాయణ, బద్ది వెంకటరమణ, గరికిన గోవింద్, కూనిశెట్టి రమణ, లాలం శాంతి, రేబాక మాలతి, సూరిశెట్టి అప్పల నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాజాన సన్యాసినాయుడు, కర్రి సాయికృష్ణ, ధూళి రంగనాయకులు, భీమరశెట్టి శ్రీనివాసరావు, దొక్కా నాగభూషణం, మామిడి శివ అప్పారావు, ఆడారి మంజు, బొద్దపు శ్రీనివాసరావు, గొర్లి నానాజీ, లాలం శ్రీభరత్, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, రాజన సూర్య నాగేశ్వరరావు, కొట్టూరు నరేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

జోష్నా భాయ్ మృతిపై హోం మంత్రి సంతాపం


టీచర్ జోష్నా భాయ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-పాయకరావుపేట : అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం, రాజానగరం పాఠశాలలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన టీచర్ జోష్నా భాయ్ పార్థివ దేహానికి తునిలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ఇది అత్యంత బాధాకరమైన సంఘటన అని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు స్పందించారని, స్థానిక నాయకులు జోష్నా భాయ్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు నిలువలేదని తెలిపారు. మంచి టీచర్‌ను కోల్పోవడం గ్రామస్తులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. టీచర్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రమాదంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు.

బిఎన్ రోడ్డులో గోతులు పూడ్చాలి

- సిపిఎం ఆధ్వర్యాన నిరసన

నిరసన చేపడుతున్న నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో కొత్తకోట బి.ఎన్ రోడ్డు సెంటర్లో ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని సిపిఎం ఆధ్వర్యంలో చేతులు జోడించి వినూత్నంగా శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, కొత్తకోట సెంటర్లో ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలనీ డిమాండ్ చేశారు. పాఠశాల విద్యార్థులు, గర్భిణీలు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసేటప్పుడు ప్రమాదాలుకు గురవుతు న్నారన్నారు. ఆర్ అండ్ బి అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టక పోవడంతో రోడ్ల దుస్థితి ఈ విధంగా ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.చీకటి పడితే చాలు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసేందుకు అనేకమంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే గుంతలను పూడ్చాలని, లేని పక్షంలో పలు ప్రజా సంఘాలతో భారీ ఉద్యమం చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు సిహెచ్ శంకర్రావు, పి టిజి సంఘం అధ్యక్షులు పాంగి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంతను పరిశీలిస్తున్న సమంత కుమార్

సంతలో షెడ్ల నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగులలో ప్రతి సోమ, గురువారాలలో జరిగే వారపు సంతలో షెడ్లు నిర్మించేందుకు కృషి చేస్తామని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సమంత కుమార్ తెలిపారు. శనివారం సంత జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో షెడ్లు నిర్మిస్తే రైతులు, గిరిజనులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. గిరిజన వికాస సంస్థ ద్వారా నాబార్డ్కు షెడ్డు నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. షెడ్ల నిర్మాణాలకి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల కళావతి, ఆర్యవైశ్య ఐవిఎఫ్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు, కరణం త్రినాధరావు, అనుసూరి శ్రీనివాస్, తరుణ్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాత కృష్ణదేవిపేట సత్యసాయి సేవా సమితి సభ్యులు శనివారం పాతకృష్ణదేవిపేట, పల్లా వూరు గ్రామంలోని 50 మంది వృద్ధులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం సత్య సాయిబాబా జయంతి సందర్భంగా 2000 మంది భక్తులకు, గ్రామ ప్రజలకు అన్నప్రసాదం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు రమణ మాస్టర్, పివి.రమణ పాల్గొన్నారు.

దుస్తులు ఇస్తున్న సేవా సమితి సభ్యులు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న ఎంఇఒ నరేష్

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపాధ్యాయులు అభ్యసన ఫలితాలను విద్యార్థుల నుండి రాబట్టేలా అకర్షణీయమైన విద్యా బోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి 1 కే.నరేష్ అన్నారు. నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల సహాయకుల ఒకరోజు స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిసెంబర్ 5 నుండి 100 రోజుల ప్రణాళికలు అమలు అవుతాయన్నారు. వీటిపై ఈ సమావేశంలో ఉపాధ్యాయులు చర్చించి మెరుగైన ఫలితాలు తీసుకు రావడానికి కృషి చేయాలని తెలిపారు. పాఠ్యాంశాలను ఆసక్తికరంగా బోధించడానికి ఎలాంటి బోధన వ్యూహాలు అవలంబించాలో ఈ సమావేశంలో చర్చించాలన్నారు. పరీక్షా సంస్కరణలో వచ్చిన మార్పులను తెలుసు కోవాలని సూచించారు. విద్యాశక్తి కార్యక్రమం పాఠశాలలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గత రెండు పర్యాయములుగా నిర్వహించిన నిర్మాణాత్మక పరీక్షలో సంగ్రహణాత్మక పరీక్షలలో వచ్చిన మార్కులను విశ్లేషణ చేసి వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 ఆర్.నాగన్న దొర, హైస్కూల్ హెచ్ఎంలు పి విజయ, వేమగిరి నూకరాజు, ఎస్.జయ శ్రీ, శ్రీలక్ష్మి చిన్నతల్లి, వరలక్ష్మి, బషీర్ ఖాన్, రిసోర్స్ పర్సన్లు ఎన్ వి ఎస్ ఆచార్యులు, టి.వి.రమణ ప్రియదర్శిని, వైవి రమణ, సిహెచ్ రమేష్, ఏసు దేవుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి

- హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - నక్కపల్లి: రానున్న స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లి లో హెూం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం సమన్వయ కమిటీతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. స్థానిక ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

24న రామునాయుడు సంస్మరణ సభ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చోద్యం గ్రామంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ మాకిరెడ్డి రామునాయుడు సంస్మరణ సభ ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి జీ.రాధాకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకా భాస్కరరావు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు నిర్వహిస్తూ హఠాన్మరణం చెందడంతో పార్టీ శ్రేణులను, కుటుంబ సభ్యులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఈ సంస్మరణ సభకు ప్రతీ ఒక్కరు హాజరు కావాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పి.యం.ఆర్.సి కార్యాలయం సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లల అవసరాల పై వివిధ శాఖల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా లేప్రసి ఎయిడ్స్ మరియు టీబి అధికారి ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలు, వారి కుటుంభ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, విధ్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలు అవసరాలు, ఎదుర్కొటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కార చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభావిత రోగులు తీసుకుంటున్న జాగ్రత్తలు, చర్యలను అడిగి తెలుసుకున్నారు. మందులను సక్రమంగా తీసుకోవాలన్నారు.

ఉపాధి హామీపై గ్రామసభలు

నాతవరంలో గ్రామ సభ నిర్వహిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-నాతవరం: నాతవరం పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ పథకంపై గ్రామ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ, 2026-27కు సంబంధించి ఉపాధి పనుల గుర్తింపు కోసం ఈ గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. అర్హులు ఉంటే జాబ్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చెరువులు, ఫారం ఫండ్స్, కాలువలు, హార్టికల్చర్ కు సంబంధించి పనులు చేయాలని తీర్మాంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి, కోఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ అపిరెడ్డి మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బి.చంద్రశేఖర్, ఉపాధి హామీ పథకం ఈసీ రాధిక, వీఆర్పీలు రాఘవ, నాగబాబు, తెలుగు యువత మాజీ అధ్యక్షులు శెట్టి లోవ, ఉపాధి హామీ మేట్లు, గ్రామస్థులు పాల్గన్నారు.

చీడికాడ: కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఉపాధి హామీ కూలీలు పని దినాలు ఉపయోగించు కోకుంటే జాబు కార్డులను రద్దు చేస్తున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ లెక్కల సత్యవతి తెలిపారు. మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో ఉపసర్పంచ్ కురచా కౌశల్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ మాట్లాడుతూ, ఉపాధి పనులకు వెళ్లని జాబ్ కార్డులను రద్దు చేసి, వారి పేర్లను గ్రామ సచివాలయం వద్ద నోటీస్ బోర్డ్ లో అతికిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీర్రాజు, ఈసీ సతీష్, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

నర్సీపట్నం: మండల వ్యాప్తంగా ఉపాధి జాబ్ కార్డులను పరిశీలిస్తున్నట్లు ఏపీవో సత్యవతి తెలిపారు. పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని సూచించారు, మండల వ్యాప్తంగా 12959 జాబ్ కార్డులకు గాను 11233 వరకు ఈకేవైసీ పూర్తి అయినట్లు చెప్పారు.

మాడుగుల: ఉపాధి హామీ జాబ్ కార్డులను దరఖాస్తులు పెట్టుకోవాలని మాడుగుల గ్రామ సర్పంచ్ యడ్ల కళావతి పేర్కొన్నారు. స్థానిక విశాఖ డైరీ పాల కేంద్రంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు.ఈ ఆమె మాట్లాడుతూ, గ్రామ పరిధిలో ఉన్న వీఆర్పీలకు ఆధార్, రేషన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్‌తో పాటు దరఖాస్తు ఫారం జతపరిచి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, పంచాయతీ కార్యదర్శి రెడ్డి నాయుడు, ఏపీవో మురళీకృష్ణ,అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు శ్రీనాథ్ శ్రీనివాసరావు, వి ఆర్ పి పాపయమ్మ, పాల సంఘం సెక్రెటరీ పాము వెంకటరావు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని కంచుగుమ్మల గ్రామంలో శనివారం ఏపిఒ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో పొరపాటున తొలగింపబడిన జాబ్ కార్డులు వివరాలు, కొత్తగా జాబ్ కార్డులు కావలసిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం, జాబ్ కార్డులో చేరికలపై దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీ అమ్మాజీరావు పాల్గొన్నారు.

కోటవురట్ల : ఉపాధి హామీ జాబ్ కార్డుదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీవో నాగరాజు అన్నారు. ఈ మేరకు శనివారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్‌రావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని ఆర్‌వై.అగ్రహారం గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ గ్రామసభ శనివారం జరిగింది. కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ జై.కుమార్, గ్రామ సర్పంచ్ కన్నూరు లక్ష్మీ నాగభూషణం, కార్యదర్శి ప్రవీణ్, ఉప సర్పంచ్ లెక్కల అచ్చిబాబు, విఆర్‌పి దండు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని విస్సన్నపేట గ్రామపంచాయతీలో ఉపాధి హామీపై శనివారం గ్రామసభ జరిగింది. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.చంద్రశేఖర్‌రావు, గ్రామ సర్పంచ్ ఉప్పునూరి మాణిక్యం, ఉపాధి హామీ అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మల్ల శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ నాగమణి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామ సచివాలయంలో శనివారం ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరె బాబురావు, కార్యదర్శి కిల్లో అర్జున్, మండల టెక్నికల్ అసిస్టెంట్ సీమునురి సత్యనారాయణ, క్షేత్రస్థాయి అసిస్టెంట్ కోన నరసింగరావు పాల్గొన్నారు.

కె.కోటపాడులో హాజరైన నేతలు, అధికారులు

నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

సముద్రానికి దూరం చెయ్యొద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి:సముద్రమే తమ జీవనా ధారమని, చేపల వేట సాగకపోతే బతుకు లేదని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి గంగమ్మ తల్లి నుండి తమను దూరం చేయొద్దని మత్స్యకారులు వేడుకున్నారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శనివారం నాటికి 70వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమకు ఉపాధి లేకుండా పోతుందని, తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాల నుండి సముద్రం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, చేపలు వేట తప్ప మరే వృత్తి తమకు తెలియదన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే సముద్రం పూర్తిగా కలుషితం అవుతుందని, దీంతో చేపల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోతుందని, తద్వారా తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం స్పందించి తమ జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు చేపల సోమేష్, సోమేశ్వరరావు, కోదండరావు, కాశీరావు, అప్పలరాజు, చిట్టమ్మ , నూకమ్మ, వి.అప్పలరాజు, కారే వెంకటేష్, నల్ల, కోటి, పి.సత్తయ్య, ఎం.కాశీ, బి.నూకరాజు పాల్గొన్నారు.

బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రసాద్

ఫిలాటెలిస్ట్ ప్రసాద్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - ఉక్కునగరం :తపాలా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌లో విశాఖ నగరంలోని వడ్లపూడి ప్రాంతానికి చెందిన సిరపరశెట్టి వర వెంకట రామ్ ప్రసాద్ అరుదైన గౌరవం సొంతం చేసుకున్నారు. ఒలింపిక్స్‌పై తాను సేకరించిన స్టాంపులను ప్రదర్శనకు ఉంచారు. కాకినాడలోని కళామందిర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక బహుమతి దక్కించుకున్నారు. అతను గతంలో అనేక పోటీల్లో పాల్గొని బహుమతులు కైవశం చేసుకున్న విషయం తెలిసిందే. వైజాగ్‌లో నిర్వహించిన అపెక్స్ 2022 రాష్ట్ర స్థాయి ఫిలాటెలీ పోటీల్లో రజత పతకాన్ని గెలిచి విశాఖ కీర్తిని చాటిచెప్పిన విషయం విదితమే. తాజాగా కాకినాడలో జరిగిన ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌లో బహుమతి పొందిన ఆయన్ని పలువురు అభినందించారు.

బెన్నవరం సర్పంచ్ భర్త రమణ మృతి

ప్రజాశక్తి-చింతపల్లి:చింతపల్లి మండలం బెన్నవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ బచ్చేల సన్యాసమ్మ భర్త, గ్రామ అభివృద్ధికి గురువుగా పేరుపొందిన బచ్చేల రమణ (65) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణ శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లోనే చనిపోయారు. 1985 నుండి 2019 వరకు సిపిఐ మండల కార్యదర్శిగా పనిచేసిన రమణ పని చేశారు. రమణ స్ఫూర్తితోనే 2020లో ఆయన భార్య సన్యాసమ్మ స్వాతంత్ర అభ్యర్థిగా సర్పంచ్‌గా విజయం సాధించి, అనంతరం టీడీపీలో చేశారు. రమణ మృతదేహాన్ని వందలాది మంది ప్రజలు, బంధువులు, రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

- హోం మంత్రి అనిత - నక్కపల్లిలో రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వంపెద్దపీట వేస్తుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లి హాకీ క్రీడా మైదానంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 22 నుండి 24 వ తేదీ వరకు మూడు రోజులు పాటు జరిగే బాల బాలికల అండర్ –19 రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలను శనివారం హోం మంత్రి అనిత ప్రారంభించారు.ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హోం మంత్రి అనిత మాట్లాడారు. నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఏర్పాటు చేసి, విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చి దిద్దుతున్న బలిరెడ్డి సూరిబాబును అభినందించారు. నక్కపల్లిలో 40 నుండి 50 మంది హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాల స్థాయిలోనే క్రీడలను ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్టేడియం, ప్రతి జిల్లాలో ఒక అకాడమీ ఉండాలని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందన్నారు. నక్కపల్లి లో స్థల సేకరణ చేపట్టి హాకీ అకాడమీ ఏర్పాటు చేస్తామన్నారు.ముఖ్యంగా బాలికలు ఎంతో ఉత్సాహంతో ముందుకు రావడం చాలా ప్రత్యేకతని, క్రీడల్లో పాల్గొనేందుకు పంపించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాలల స్టాఫ్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంతకుముందు పాఠశాలల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, వివిధ క్రీడలు వంటివి ఉండేవని, ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు సీట్లు, అధిక మార్కులని ఒత్తిడి తీసుకొస్తున్నారని, దీంతో మానసిక ఒత్తిడితో కొంతమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు.జీవితంలో చదువే కాదని క్రీడలు కూడా ముఖ్యమని గుర్తించాలన్నారు.ఎస్ జి ఎఫ్ ప్రతినిధులను హోంమంత్రి అనిత సత్కరించారు. బాలికల నృత్యాలు, క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా డిఈఓ ఉమారాణి, అనకాపల్లి జిల్లా డిఈఓ వినోద్ బాబు, తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపీడీవో చైతన్య, ఎంఈఓ నరేష్,డి.ఎస్.డి.ఓ పూజారి శైలజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.ఎ. పుష్ప లత, రాష్ట్ర పరిశీలకులు రవి రాజు, బియస్ హాకీ క్లబ్ ఫౌండర్ బి. సూరిబాబు, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివ దత్, జనసేన నేత తోట నగేష్, హాకీ క్లబ్ ప్రతినిధులు చిన్నఅప్పారావు, రామచంద్రరావు, కొల్నాటి తాతాజీ, రాంబాబు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి అనిత

హోరా హోరీగా పోటీలు

బాలురు విభాగం లో కడప -ప్రకాశం జిల్లాల విద్యార్థులు పోటీ పడగా కడప 7–0తో విజయం సాధించింది. విజయనగరంపై గుంటూరు 4–1 తోనూ, కృష్ణాపై 13–0 తో నెల్లూరు విజయం సాధించింది. శ్రీకాకుళంపై ఈస్ట్ గోదావరి, గుంటూరుపై 2–0 తో అనంతపురం, వెస్ట్ గోదావరిపై చిత్తూరు, కృష్ణాపై విశాఖపట్నం జట్టు విజయం సాధించింది. బాలికల విభాగం లో విజయనగరంపై 2–0 తో ప్రకాశం విజయం సాధించింది. నెల్లూరుపై - కడప, వెస్ట్ గోదావరిపై 0–4 తో విశాఖపట్నం విజయం సాధించింది.

కెజిబివిని సందర్శించిన జిసిడిఒ

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి కస్తూర్బా బాలిక విద్యాలయాన్ని జి సి డి ఓ (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) జెమిమా శనివారం సందర్శించారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా విద్యార్థులకు విద్యాబోధన అందించాలన్నారు. వృత్తి విద్యా కోర్సు గురించి ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆధార్ శిబిరాన్ని పరిశీలించారు.

ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న జిసిడిఒ

పోలీసు కుటుంబాల సంక్షేమమే ధ్యేయం

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి- అనకాపల్లి:పోలీస్ కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా జిల్లా పోలీస్ కార్యాలయం పని చేస్తుందని ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన ప్రభుత్వ/పోలీస్ విభాగానికి సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు వేగంగా చేరేలా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గ్రాట్యుటీ, ఏపీ జి ఎల్ ఐ, పి ఎఫ్, జి ఐ ఎస్, కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, డెత్ బెనిఫిట్స్, పి ఎస్ పి సొలరీస్ లో భాగంగా గవర్నమెంట్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ బెనిఫిట్స్ వంటి అన్ని ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సిబ్బంది పిల్లల చదువు, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్తు భద్రతపై సమగ్ర సమీక్ష చేశారు. విధి నిర్వహణలో గాయపడిన లేదా ప్రమాదాల్లో మరణించిన సిబ్బంది కుటుంబాలకు సంబంధించిన పిల్లల విద్య, ఉద్యోగ అవకాశాలు, అందాల్సిన బెనిఫిట్స్, వంటి అంశాలపై పూర్తి వివరాలు సేకరించి తక్షణ సూచనలు ఇచ్చారు.అనకాపల్లి జిల్లా పోలీస్ అడ్ హక్ కమిటీ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో మరణించిన ఆరుగురు పోలీస్ సిబ్బంది కుటుంబాలకు చెక్కులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, ఏవో సి.హెచ్.తిలక్‌బాబు, ఇన్స్పెక్టర్లు ఎన్.అప్పలనాయుడు, బి.రామ కృష్ణారావు, పోలీస్ అడహక్ కమిటీ సభ్యులు, ఆఫీస్ సూపరిండెంట్లు ప్రతాప శేషయ్య, దేవరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

జర్నలిస్టులు మీడియా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మణిరామ్

ప్రజాశక్తి- అనకాపల్లి:అనకాపల్లి జిల్లా సమాచార, పౌర సంబంధాల కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో విశాఖపట్నం ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణి రామ్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. 2026–27 మీడియా అక్రిడిటేషన్ జారీ ప్రక్రియపై సమగ్రంగా వివరించారు. అక్రిడిటేషన్ దరఖాస్తుల అప్లోడ్‌లో ఎదురవుతున్న సమస్యలు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం, యూనియన్లు–సంఘాలతో సమన్వయం చేసే అంశాలు, అవసరమైన పత్రాలు వంటి కీలక విషయాలపై సూచనలు, మార్గదర్శకాలు అందించారు.జర్నలిస్టులందరూ వ్యక్తిగతంగా పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని తమ వివరాలను, సంస్థ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొని తమ సందేహాలను నివేదించగా, సంయుక్త సంచాలకులు వాటికి పరిష్కార మార్గాలను తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమాచారం కార్యాలయం నుండి చేకూరి బాలాజీ, అసిస్టెంట్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్, పిఆర్వో షణ్ముఖరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మణిరామ్